కథానిక

# దొంగలా : దొరలా

"విశాఖ"

"చూసేవా మీ అన్న ఏం చేసేడో? కోటు జేబులో పెట్టుకొన్న పాతిక రూపాయలూ పట్టుకొని పోయేడు. మీ అన్న గాబట్టి నీ మొహం చూసి వూరుకొంటున్నాను. మరొకడైతే జైల్లో పెట్టించే వాణ్ణి."

కాఫీ ఇవ్వడానికి వచ్చిన భార్యను చూసి రాధాకృష్ణమూర్తి కోపంగా, అపహాస్యంగా అన్నాడు. సుశీల తన అన్నయ్య చేసిన పనికి చెప్పలేనంత సిగ్గు పడింది.

* * *

సుశీల పుట్టిన ఆరు నెల్లలోగానే తండ్రి పోయేడు. అప్పట్నుంచీ తల్లి నరసమ్మ కొడుకు సుబ్రమణ్యాన్ని, కూతురు సుశీలనీ ఎలాగో కష్టపడి పెంచుతూ వచ్చింది. బంధువులంతా ఎండ తగలగానే మంచు తెరలన్నీ మాయమైనట్లుగా మాయమయేరు. సుబ్రమణ్యానికి పదిహేనో ఏటే సంసార బాధ్యత నెత్తిన పడింది.

సుబ్రమణ్యం స్వతహాగా తెలివైనవాడు. పదిహేనేళ్ళకే స్కూల్ ఫైనల్ పాసయేడు. స్కూల్ ఫైనల్ చదివే రోజుల్లోనే అప్పుడప్పుడు పెద్దపెద్ద చదువులు చదువుదామని, గొప్ప ఉద్యోగాలు చేద్దామని ఇంకా ఏమేమో అనుకొంటూ వుండేవాడు. ఒక్కొక్కప్పుడు ఏకాంతంగా కూర్చొని తన జీవితంలో ముప్ఫైయ్యో ఏటివరకూ ఎట్లా గడుస్తే బాగుంటుందో రకరకాలుగా యోచించుకొని తీయటి కలలు కంటూ వుండేవాడు. కాని ఆ అతిమధురమైన కలలన్నీ చాలా అసంతృప్తికరమైన భవిష్యత్తుకే దారితీస్తాయని ఆ అమాయిక ప్రాణికేం తెలుసు?

సుబ్రమణ్యానికి అప్పటికీ ఇప్పటికీ బాగా జ్ఞాపకం వుంది. తను స్కూల్ ఫైనల్ పరీక్ష పేసయినట్లు రిజల్ట్సు వచ్చిన రోజున ఆత్రుతగా పేపరు పట్టుకొని ఇంట్లో ప్రవేశించేడు.

"అమ్మా పరీక్ష పేసయేనే. రిజల్ట్సు వచ్చేయి..." ఆనందంతో గొంతుక బొంగురు పోయింది. ఇంకా ఏమిటో చెబుతామనుకొన్నాడు గాని చెప్పలేక పోయేడు.

"చాలా సంతోషం నాయనా. ఇంక నువ్వేదయినా ఉద్యోగంలో చేరితే..." వాక్యం పూర్తి కాకుండానే ముగించింది నరసమ్మ.

సుబ్రమణ్యానికి తన ఇంటి ఆర్థిక పరిస్థితి అంతా ఒక్కసారి అవగాహన అయింది. పిచ్చికాని, తను పైచదువులు చదువుదామనుకోవడమేమిటి? తాను ఇంటర్మీడియేటు చదువుతానని స్నేహితు లెవరితోనూ చెప్పనందుకు చాలా సంతోషించేడు సుబ్రమణ్యం.

సుబ్రమణ్యం ఉద్యోగంలో చేరేడు. నెలకు డెబ్భైరూపాయలు. మొదట్లో ఏక్టింగు ఐనా రానురాను పెర్మనెంట్ అవుతుందన్నారు. నరసమ్మ ఆనందానికి మేరలేకపోయింది, తన ఒక్కగాని ఒక్క కొడుకు చేతి కందుకొచ్చి నాలుగురాళ్లు తెచ్చుకో గలుగుతున్నందుకు.

సుబ్రమణ్యానికి మాత్రం ఆ ఉద్యోగం తల కొట్టుకున్నట్లే వుంది. తోటి కుర్రవాళ్ళతో కలిసి గోడీబిళ్ళ, చెడుగుడు ఆడుకొనే ప్రాయంలో ఆ స్వేచ్ఛనీ హాయినీ చంపుకొని వేళపట్టున ఆఫీసుకి వెళ్ళి అధికార్ల దగ్గర అణగి నిలుచోడం కష్టంగాదూ? వ్యక్తిత్వానికి బీజాలు నాటవలసిన ఆ ప్రాయంలో నెలాఖరున జీతం డబ్బులు మిగలక కించపడడం మనస్సుని ఎట్లా క్రుంగదీస్తుంది? ఒక్క విషయం మాత్రం సుబ్రమణ్యానికి అర్థం కాకుండా నిలిచిపోయింది. స్కూలు ఫైనల్లో తన దగ్గర లెక్కలు చెప్పించుకొన్న వాళ్ళంతా ఇప్పుడు ఇంటర్మీడియేటు చదువుతూ వుండగా తనొక్కడే ఈ పాడు ఉద్యోగంలోపడి యెందుకు క్రుంగిపోవాలి? ప్రపంచంలో వ్యక్తికీ వ్యక్తికీ మధ్య ఇంత తేడా యెందుకుంది?

ఐతే ఇవన్నీ సుబ్రమణ్యానికి ఉద్యోగంలో చేరిన కొత్తలో కలిగిన ప్రశ్నలు. రానురాను ఆ ప్రశ్నలన్నీ మరచిపోయి ఒక ఆఫీసు గుమాస్తా కాగలిగేడు.

ఉద్యోగంలో చేరిన మూడేళ్ళకి సుబ్రమణ్యానికి కొత్త సమస్య ఒకటి ఎదుర్కొంది. ఐతే అది పూర్తిగా కొత్త సమస్య అనడానికి వీలులేదు. బీదవాళ్ళకి జీవితంలో యెప్పుడూ ఒకటే సమస్య. అదే వివిధరూపాలతో రోజుకో తీరుగా యెదుట సాక్షాత్కరిస్తూ వుంటుంది. చెల్లెలు సుశీల పెద్దమనిషై కూచుంది. పెళ్ళి చెయ్యాలని తల్లి తొందరపడుతోంది. ఊళ్ళో వాళ్ళప్పుడే "నరసమ్మగారూ, ఈ ఏడు మాకు పప్పన్నం పెట్టరా" అని పెళ్ళికెదిగిన పిల్ల వుందని జ్ఞాపకం చేసి పోతున్నారు. కొడుకుది ఎలాగూ చాలీచాలని సంపాగం అయింది. కూతురైనా కొస్త కలిగినవాళ్ళకిద్దామని నరసమ్మ ఆశ. దాంతో వున్న భూమి కాస్తా తెగనమ్మి, శక్తి లేకపోయినా సాగి మూడు వేలు కట్నం ఇచ్చి, లాంఛనాలుచేసి సుశీలకి పెళ్ళి చేసేరు. పెళ్ళికొడుకు ఎమ్. బి. బి యస్. పేసయేడు. ప్రైవేట్ ప్రాక్టీస్ పెట్టుకొంటాడు. పెళ్లయిన నెలలోనే పెళ్ళికొడుకు తల్లి నరసమ్మతో "మా కోడల్ని పంపించి వేయండమ్మా. ఇంకా ఎన్నాళ్లు పెళ్ళాం లేకుండా కూచుంటాడు మావాడు?" అంది. నరసమ్మ మరో మూడువందలు ఖర్చుపెట్టి డాబుగా దర్పంగా సుశీలని అత్తవారింటికి పంపించింది. పదిహేనేళ్ళ మొగవాడు ఉద్యోగంలో ప్రవేశించటం ఎలాంటిదో పధ్నాలుగేళ్ళ ఆడది కాపరానికి పోవటం కూడా అలాంటిదే. కాని అందులో రెండవది మన దేశంలో అనాదిగా వస్తున్న ఆచారం గనుక మనకి వింతగా కనిపించదు.

సుశీల పెళ్లయిన మరుసటి సంవత్సరమే సుబ్రమణ్యానికి కూడా పెళ్ళయిపోయింది. తర్వాత మరో ఆరు నెలలకల్లా నరసమ్మ తనింక ఈ భూలోకంలో సాధించవలసిన మహాత్కార్యాలు ఏమీ లేవన్నట్లుగా మరణించింది. తల్లి దహనమైపోయిన మర్నాటికి సుశీల వచ్చి ఒక్కరోజు మాత్రం ఉండి వెళ్ళిపోయింది.


ఆంధ్ర బ్యాంక్ లిమిటెడ్

(స్థాపితము : 1923)

హెడ్డాఫీసు : మచిలీపట్టణము

చెల్లింపబడిన మూలధనము, రిజర్వులు కలిసి మొత్తం } రూ. 37,45,000

అమలులోనున్న వ్యాపారము మొత్తం రూ. 6,00,00,000 లకు మించినది.

చైర్మన్ :

శ్రీ ఎస్. ఆర్. వై. శివరామ ప్రసాద్ బహదూర్ గారు,

చల్లపల్లి రాజాసాహెబ్.

డెప్యూటీ చైర్మన్ :

శ్రీ కె. సుబ్బారావు నాయుడుగారు

మచిలీపట్నం.

మద్రాసు బ్రాంచి : 321-23, లింగిశెట్టి వీథి.

త్యాగరాయనగర్ ఆఫీసు 87 పాండీ బజారు, త్యాగరాయనగర్,

మైలాపూరు ఆఫీసు . 77, కచేరీ రోడ్డు.

కోస్తా ఆంధ్ర జిల్లాలన్నిటిలోనూ బ్రాంచీలు సబ్ ఆఫీసులూ ఉన్నాయి.

అన్ని రకముల డిపాజిట్లు ఆకర్షణీయమైన వడ్డీరేట్లకు తీసుకొనబడతాయి.

వివరములు బ్యాంకు యొక్క ఏ ఆఫీసులోనైనను తెలిసికొనవచ్చును.

మేనేజింగ్ డైరెక్టరు :

కాండేపల్లి శ్రీరాములు

జనరల్ మేనేజరు :

ఇ. రామచంద్రమూర్తి

ఎం. ఏ., సి. ఏ. ఐ. ఐ. బి.

సుబ్రమణ్యానికి పెళ్లవడమే తడవుగా వరసగా పిల్లలు పుట్టుకరాసాగేరు. పెళ్ళయిన అయిదేళ్లకల్లా ముగ్గురు జీవుల్ని ఈ భూలోకానికి ప్రసాదించి, నాలుగో జీవిని సమర్పించడానికి సిద్ధంగావుంది భార్య కమాక్షి. సుశీల పెళ్ళికాకముందు భూమి ఉండేది కనుక ఎలాగో కాలక్షేపం అయేది. ఇప్పుడదీ లేదు. నెలకొచ్చిన ఆ పాడిరాళ్లు ఎనభై రూపాయలలోనూ తానేం తింటాడు? భార్యకి ముగ్గురు బిడ్డలకి ఏం పెడతాడు? ఇంట్లో నగలన్నీ క్రమక్రమంగా అమ్ముడుపడ్డాయి. ఊళ్లో అప్పులు ఎక్కువయేయి.

కామాక్షికి నాలుగోసారి పురుడు సవ్యంగా రాలేదు. బిడ్డను ఆపరేషన్ చేసి పైకి తియ్యవలసి వచ్చింది. బిడ్డ చచ్చి బైట పడింది. అదృష్టంవల్ల తల్లికి ప్రాణాపాయం తప్పింది. డాక్టరు ఆమె ఆరోగ్యాన్ని చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలని హెచ్చరించి, ఏవో మూడు నాలుగు టానిక్కులు రాసిచ్చి పోయేడు.

సుబ్రమణ్యానికి దిగులు హెచ్చింది. వీటన్నిటికీ డబ్బెక్కణ్ణుంచి తేవడం? ఇంట్లో నగలు కాస్తా ఇదివరకే అమ్ముడు బడ్డాయి. ఎరిగినంత మట్టుకు ఊళ్లో ఎవరూ అప్పు ఇవ్వరు. ఈ క్లిష్టపరిస్థితిలో చెల్లెలి సహాయాన్ని అర్థిస్తూ రెండుమూడు ఉత్తరాలు రాసేడు. అందులో ఒకదానికి మాత్రం జవాబు వచ్చింది. అందులో ఆమె మావగారు కారు కొనబోతున్నట్లు, ఇప్పటిలో వాళ్ళకి అంతా ఖర్చు సమయమైనట్లూ వుంది. అయినా వదినె ఆరోగ్యం విషయమై మాత్రం అశ్రద్ధ చెయ్యవద్దనీ ఎలాగైనా ఆ టానిక్కులు తప్పకుండా కొనమని హెచ్చరించింది.

ఆ విషయం కామాక్షితో చెప్పేడు. ఆమె బాధగా నిట్టూరుస్తూ "అవును, కారు కొనడమంటే ఖర్చే. అయినా మీరు వెళ్ళి సంగతులన్నీ ముఖస్తంగా చెప్పి అడిగి చూడండి" అని సలహా యిచ్చింది.

గుమ్మంలో సుబ్రమణ్యం అడుగు పెట్టగానే "ఓహో వచ్చేవా అన్నయ్యా" అంది. అంతే. మరి మాటలేదు. ఏదో పనిమీద లోపలికి వెళ్ళిపోయింది సుశీల.

మధ్యాహ్నం భోజనాలయేక ఎలాగో సమయం చూసుకొని చెల్లెల్ని ఏకాంతంగా పిలిచి అడిగేడు డబ్బు గురించి. ఆమె బద్ధకంగా ఒళ్లు విరుచుకొని "ఏమో డబ్బు విషయమై నాకు తెలియదన్నయ్యా. అంతగా అవసరమైతే ఆయన్నే అడగరాదూ?"

సుబ్రమణ్యం మళ్ళీ డబ్బు గురించి ప్రస్తావించలేదు. ఆమె వివాహం గురించే తను పైచదువు కాస్తా మానుకొని పదిహేనేళ్ళకే ఉద్యోగంలో చేరేడు ఆమె కలవారి ఇంటి కోడలు కావడానికి నిక్షేపంలాంటి భూమిని అమ్ముకొన్నాడు. ఆమె జీవితంకోసం తన జీవితాన్నే త్యాగం చేసేడు. కాని ఆమెకు ఆ విశ్వాసం ఏదీ? అంతగా అవుసరమైతే ఆయన్నే అడగమంది. తనలో ఏనాడో చిన్నప్పుడే చచ్చిపోయిన ఆత్మాభిమానం మళ్ళీ మొలకలెత్తింది. ఏమైనాసరే వీళ్ళనింక డబ్బు అడగకూడదనుకొన్నాడు

రాత్రల్లా అతడి మెదడులో ఒకటే ఆలోచన. కామాక్షికి మందెలా యిప్పించడం? అని మంచంమీద పడుకొని నిద్రపట్టని కళ్ళని బలవంతంగా మూసుకొని తల వేడెక్కేటట్టు ఆలోచిస్తున్నాడు. రాత్రి పదకొండు గంటలప్పుడు ఎవరో వచ్చిన శబ్దం విని కళ్లు తెరచి చూసేడు. బావ అప్పుడే వీధిలోంచి వచ్చి కోటు, చొక్కా అవీ విప్పి తీగమీద హేంగర్లకి తగిలిస్తున్నాడు. చొక్కా జేబులోంచి మనీపర్సుని తీసి కోటు జేబులో పెట్టి వెళ్ళిపోయేడు. సుబ్రమణ్యం తటాలున పక్కమీంచి లేచేడు. మనీపర్సు తీసి అందులో నోట్లు లెక్కపెట్టేడు. ఐదు ఐదు రూపాయల నోట్లు. పాతిక రూపాయలు వెన్నెల్లో మిలమిలా మెరసిపోతూ కనిపించేయి. మనీపర్సుని తిరిగి కోటుజేబులోనే పెట్టేసేడు. పాతిక రూపాయల్ని జాగ్రత్తగా మడిచి, భద్రంగా తన సంచీలో, పంచ మడతలో పెట్టేడు. మర్నాడు తెల్లవారకుండానే లేచి, నిద్దర కళ్ళతోవున్న చెల్లెలికి వస్తానని చెప్పి ఇంటి దారి పట్టేడు.